క్లుప్తంగా

క్లాప్‌మిత్రకు సత్కారం


క్లాప్‌మిత్ర రవీంద్రను సన్మానిస్తున్న డీపీఓ

సీతంపేట: స్వచ్ఛతే సేవ కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ శనివారం సీతంపేటలో పర్యటించారు. చిత్తశుద్ధితో సేవలందిస్తున్న క్లాప్ మిత్ర రవీంద్రను సన్మానించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. సర్పంచ్ ఆరిక కళావతి, ఎంపీడీఓ కె.సత్యం, ఎంఆర్సీ చిన్నారావు పాల్గొన్నారు.

చురుగ్గా ఈ-క్రాప్ నమోదు


ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పాలకొండ: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కీలకపాత్ర పోషించే ఈ-క్రాప్ నమోదుపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఈనెల 30 నాటికి శతశాతం పంటల నమోదు, ఈకేవైసీ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల వద్ద ఈకేవైసీ నమోదు ముమ్మరంగా చేపడుతున్నారు. రైతులు తాము సాగుచేస్తున్న పంటల వివరాలను పరిశీలించుకుని, బయోమెట్రిక్ వేయడం ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

26న జాబ్‌మేళా

సీతంపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న పాలకొండ తమ్మినాయుడు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వైటీసీ మేనేజర్ వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. జాబ్‌మేళాకు హెటిరో, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మెడ్‌ప్లస్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లై చేసుకోవాలని కోరారు. వివరాలకు 7993795796, 6305110947 కు ఫోన్ చేయాలని సూచించారు.

గణపతి లడ్డూ వేలం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర దేవాంగుల వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన బల్లా సోమేశ్వరరావు, సరస్వతీ దంపతులు రూ.26 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మెల్సీ పరామర్శ


సాహు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని గాందీబొమ్మ సెంటర్‌లో నివాసం ఉండే గణపతి సాహు కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. గణపతి సాహు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీతో పాటు పాలవలస దవళేశ్వరరావు ఉన్నారు.

రక్షిత పథకం నిర్మించాలని వినతి


ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: మండలంలోని చిన్నమంగళాపురంలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నూతన రక్షిత పథకం నిర్మాణానికి అధికారులు సహకరించాలని వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, ఎంపీటీసీ మజ్జి నవీన్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ప్రవళికను కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో ఉన్న రక్షిత పథకం అవసాన దశకు చేరుకుందని, దాని స్థానంలో 30 వేల లీటర్ల సామర్థ్యంతో కొత్త ట్యాంకును నిర్మించాలని కోరారు.

పిల్లలు బడుల్లోనే ఉండాలి

బలిజిపేట: పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓ సామల సింహాచలం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో జీఈఆర్‌పై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థూల నమోదు నిష్పత్తి ప్రకారం శతశాతం నమోదు చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లతో కలిసి సర్వే నిర్వహించి బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ భానుమూర్తి, సీఆర్‌పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గణపతి నిమజ్జనోత్సవం


జియ్యమ్మవలస: అల్లువాడలో వినాయక విగ్రహం ఊరేగింపు


భామిని: బత్తిలిలో నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువెళ్తున్న గణనాథుడి విగ్రహం


వీరఘట్టం: నిమజ్జనానికి ఊరేగింపుగా వస్తున్న పది అడుగుల మట్టి గణపయ్య

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో శనివారం వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. మేళతాళాలతో విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకువెళ్లారు. దారిపొడవునా డీజే పాటలకు యువకులు డాన్సులు చేస్తూ గణపయ్యకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వీరఘట్టం పట్టణంలోని కూరాకులవీధిలో శ్రీకృష్ణా సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల మట్టి గణపతి విగ్రహ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఎం.వి.రమణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జియ్యమ్మవలస మండలం అల్లువాడలో వినాయక నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా సాగింది. భామిని మండలంలో బత్తిలి చిన్నవీధి, పెద్దవీధి, కుమ్మరివీధి, నేరడి-బి, గురండి, భామిని, బిల్లుమడ, బాలేరు, కోసలి గ్రామాల్లో గణనాథులను ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార నదిలో నిమజ్జనం చేశారు.

– సాక్షి పాలకొండ, కురుపాం

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

• అధికారుల తీరుపై ఎంపీపీ అసంతృప్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉరిటి రామారావు

గరుగుబిల్లి: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు కాలయాపన చేయడం సరికాదని ఎంపీపీ ఉరిటి రామారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రెవెన్యూకు సంబంధించిన పనులు ఎప్పటికప్పుడు పరిష్కారం కావడం లేదని, పనుల విషయంలో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని తహసీల్దార్ జీవీ జనార్దన్‌ను ప్రశ్నించారు. గొట్టివలస రెవెన్యూ పరిధిలోని కొండను అటవీశాఖకు, మైన్స్‌వారికి ఇవ్వడం వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని సుంకి సర్పంచ్ కె.రవీంద్ర; కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సకాలంలో మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీవీపురం ఎంపీటీసీ సీహెచ్ రూపవతి సభ దృష్టికి తీసుకువచ్చారు. నాగూరు గ్రామంలో పలువురు నిరుపేదలకు కేటాయించిన ఇంటి స్థలాలను ఇంద్రాని క్లస్టర్ రైస్ మిల్లు అసోసియేషన్‌కు అధికారులు ఎలా కేటాయిస్తారని నాగూరు సర్పంచ్ కె.శిరీష ప్రశ్నించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని రావివలస, గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.అరుణకుమారి, కె.కె.సాగర్ వర్మలు కోరారు. సమావేశంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఎంఈఓ ఎస్.నాగభూషణరావు, విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు, జేఈలు ఫరూక్ సైఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన


సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 నేతృత్వంలో ఉమన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో సికెల్ సెల్ ఎనీమియాపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది కె.నాగమణి వివరించారు. రోగులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ సహచరులకు, గ్రామస్తులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, బి.రాజు, ఎం.శాంతి, పి.రామారావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు

• ఉపాధిహామీ పీడీ రామచంద్రరావు


ప్రజావేదికలో ఉపాధి పనులపై విచారణ చేస్తున్న అధికారులు

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీలపై ప్రజావేదికను శనివారం నిర్వహించారు. 2022 ఏప్రిల్1 నుంచి 2023 మార్చి 31 వరకు ఉపాధి నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీల నివేదికను వెల్లడించారు. పలు గ్రామాల్లో తప్పుడు మస్తర్లు నమోదు చేసినట్లు, పనులు చేయకుండానే బిల్లులు చెల్లించినట్లు ఫిర్యాదులు అందాయని, విచారణలో అవి నిజమని తేలితే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని పీడీ రామచంద్రరావు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ ఎం.తిరుపతిరావు, గోవిందరావు, ఏపీఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగులో బయోచార్ కీలకం


బయోచార్ పద్ధతిలో బొగ్గు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

భామిని: మండలంలోని సన్నాయిగూడలో గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై వాస్సన్ సంస్థ ప్రతినిధులు శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బొగ్గు ద్వారా భూసారం పెంచే (బయోచార్) విధానాన్ని చెన్నై మురగప్ప రీసోర్స్ సెంటర్ ప్రతినిధి సుకుమార్ వివరించారు. అందుబాటులో నిరుపయోగంగా ఉన్న కలప ద్వారా మనం పండించే పంటలకు ఎరువు తయారు చేసే విధానం వివరించారు. అటవీ ప్రాంతంలో లభ్యమైన కలప ద్వారా, జీవ పదార్థాలను తక్కువ ఉష్ణోగ్రత వద్ద తయారు చేసే బొగ్గును సేంద్రీయ ఎరువుగాను, వర్మీ కంపోస్టుగాను ఉపయోగించే పద్ధతిని తెలియజేశారు. వీటిని పొలంలో వేసుకోవడం వల్ల నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని, పంటలకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో వాస్సన్ ప్రతినిధులు కళ్యాణ్ పాత్రో, ముద్దాడ భార్గవి, కీర్తిరాయి సుగ్రీవులు తదితరులున్నారు.

ప్రజల ఆరోగ్యానికి భద్రత

పాలకొండ రూరల్:


గొట్ట మంగళాపురంలో జగనన్న ఆరోగ్య సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది, ప్రజాప్రతిధులు

ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో వ్యక్తిగత ఆరోగ్య భద్రత లభిస్తుందని గొట్టమంగళాపురం సర్పంచ్ కరణం బాబ్జిరావు అన్నారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో గ్రామంలో ఇంటింటి ఆరోగ్య సర్వేను శనివారం నిర్వహించారు. ఆరోగ్య సర్వే ఆవశ్యకతను గ్రామస్తులకు వివరించారు. ప్రజలకు బీపీ, సుగర్, రక్తహీనత, వైరల్ జర్వాల నిర్ధారణకు రక్త పరీక్షలు చేశారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కరణం నానిబాబు, ఇప్పిలి ఆదిబాబు, కె.భవాని, వైద్య సిబ్బంది కె.రాణి, ఆర్.సంధ్య, బి.రమణమ్మ, వసుధ, డి.గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’ను విజయవంతం చేయాలి


జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణపై వైద్యులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి అన్నారు. శనివారం తన కార్యాలయంలో అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశమై కార్యక్రమం అమలుపై సమీక్షించారు. ప్రస్తుతం ఇంటింటి సర్వే జరుగుతోందని, ఈ నెల 30 నుంచి సచివాలయాల పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాల్లో వివిధ విభాగాల వైద్య నిపుణులు సేవలందించేందుకు, రక్త పరీక్షలు, మందుల పంపిణీకి వీలుగా వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యులు కడియం చిరంజీవి, వి.కమల్‌నాథ్, ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలు పక్కాగా నిర్వహించాలి

• జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు


గరుగుబిల్లి: రోగులకు సూచనలు చేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: ఆరోగ్య శిబిరాలను పక్కాగా నిర్వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఎస్ఆర్‌పేటలో శనివారం నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నారు. ఈ నెలాఖరు నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి చిన్నారుల హెల్త్ రికార్డులను పరిశీలించారు. పిల్లల ఎత్తు, బరువు, తదితర వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డాక్టర్ పీపీ ప్రియాంక, సూపర్‌వైజర్లు రవణమ్మ, జయగౌడ్ తదితరులున్నారు.

అలమండలో..

జియ్యమ్మవలస: మండలంలోని అలమండ సచివాలయం పరిధి అప్పన్నదొరవలస గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య పరీక్షలు చేశారు. గ్రామానికి చెందిన బి.గౌరమ్మ అనే మహిళకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వెంటనే 108కు ఫోన్‌చేసి పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

భక్తిశ్రద్ధలతో రాధాష్టమి


రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను ఊయలలో వేసి ఊపుతున్న భక్తులు

భామిని: మండలంలోని లివిరి గ్రామంలో వెలసిన గోపీనాథ రాధాకృష్ణ మందిరంలో శనివారం రాధాష్టమి వేడుకలు నిర్వహించారు. పర్లాఖిమిడి జమిందారులైన గజపతులు నిర్మించిన ఈ ఆలయంలో రాధారాణి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానికులతో పాటు ఒడిశాలోని గుణుపూర్, పర్లాకిమిడి, కాశీనగర్, రాయగడ్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి రాధా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. పూలతో అలంకరించిన ఊయలలో రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తి గీతాలు ఆలపిస్తూ తన్మయత్వం చెందారు. వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. బత్తిలి రాధాకృష్ణ మందిరంలోనూ రాధాష్టమి వేడుకలు నిర్వహించారు.

స్వామీ.. వారికి బుద్ధిని ప్రసాదించు..


వినాయకుడిని దర్శించుకున్న జెడ్పీ పాఠశాల విద్యార్థులు

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శనివారం వినూత్నంగా నిరసన తెలియజేశారు. పాఠశాలకు వెళ్లే రహదారిలో, పాఠశాల పక్కన ఉన్న వంటి గది వద్ద ఆరుబయట మలమూత్రన విసర్జన చేస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారంతా కలిసి స్థానిక బీసీ కాలనీలో కొలువైన వినాయకుడిని శనివారం దర్శించుకుని తమ సమస్యను చెప్పుకున్నారు. స్వామీ ఆరు బయట మలమూత్ర విసర్జన చేసేవారికి మంచి బుద్ధి ప్రసాదించు తండ్రీ అని వేడుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో పాటు వ్యాయామోపాధ్యాయుడు శ్రీనివాసరావు, స్థానిక యువత ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాలకొండ: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకులు ఎస్.హిమప్రభ, బి.అమరవేణి కోరారు. ఈ మేరకు పట్టణంలోని సీడీపీఓ కార్యాలయం వద్ద ఎల్‌డీసీ అరుణజ్యోతికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.శ్రీదేవి, జి.జెస్సీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

• అన్నసమారాధన


సీతంపేట: కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం


కురుపాం: నెయ్యిలవీధిలో స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు


పాలకొండ రూరల్: సత్యసాయి శివం మందిరం సమీపంలో కొలువుతీరిన గణపతి మండపంలో పూజలు చేపడుతున్న యువత

సీతంపేట, కురుపాం, పాలకొండ రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట, కురుపాం మండలాల్లోని పలు గ్రామాల్లో గణపతి మండపాల వద్ద శనివారం అన్నసమారాధనలు నిర్వహించారు. సీతంపేట మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో, కురుపాం మండల కేంద్రంలోని గౌడువీధి, శివ్వన్నపేట, నెయ్యిలవీధిలో అన్నదాన కార్యక్రమాలు చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. పాలకొండ పట్టణంలోని వెంకటరాయుని కోనేరు, కోమటిపేట, గొల్లవీధి, కొత్తవీధి, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.